క్లుప్తంగా

పూజారి కుటుంబానికి మంత్రి పరామర్శ



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో గుండెపోటుతో మంగళవారం మృతి చెందిన సమ్మక్క పూజారి సిద్దబోయిన దశరథం కుటుంబాన్ని మంత్రి సీతక్క బుధవారం పరామర్శించారు. పూజారి కుటుంబాన్ని మంత్రి సీతక్క ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు. పూజారి దశరథం మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. జాతర కమిటీ చైర్మన్ అరెం లచ్చుపటేల్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పరీక్ష వెంకన్న, నాయకులు సిద్దబోయిన రమేష్, పూజారులు ఉన్నారు.

వెంకటాపురం(ఎం)లో..

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన తడుక రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సకల్లుగీతా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జంపన్నవాగులోని ఇన్‌ఫిల్టరైజేషన్ బావిలో మంగళవారం గల్లంతైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట మండలానికి చెందిన అద్దంకి అంజి(35) మృతదేహం బుధవారం లభ్యమైంది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు బావిలో దిగి మృతదేహాన్ని బయటికి తీశారు. గజ ఈతగాళ్లకు పోలీస్, ఫైర్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. రెస్క్యూ టీం కానిస్టేబుళ్లు పూజారి రమేష్, సాంబయ్య, ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు కలిసి బయటికి తీశారు.

వ్యక్తికి గాయాలు

ఏటూరునాగారం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలైన సంఘటన మేడారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని ఓడవాడకు చెందిన బాస రాజ్‌కుమార్ మేడారం సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో మేడారంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికులతో బయటకు వస్తున్న బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్ తలకు తీవ్రంగా గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ప్రమాదానికి గల కారణాలను సేకరించారు.



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



సారలమ్మ గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

తల్లులకు మొక్కులు

జాతరను తలపించిన 'తిరుగువారం'

- కిటకిటలాడిన మేడారం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు బుధవారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవార్ల తిరుగువారం పండుగను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి వచ్చి జంపన్నవాగులో స్నానాలు అచరించి అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమలు, ఎత్తు బంగారం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క ప్రధాన అర్చి ద్వారం నుంచి భక్తులను నేరుగా గద్దెల పైకి అనుమతించారు. దీంతో అమ్మవార్ల గద్దెలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల సందడితో గద్దెల ప్రాంగణంలో మరోసారి జాతర సందడి కనిపించింది. మొక్కుల అనంతరం భక్తులు సమీప అటవీ ప్రాంతాల్లో విడిది చేసి వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. తల్లి సల్లంగా చూడు.. మళ్లొచ్చే జాతరకు వస్తామని మొక్కులు చెల్లించుకొని తిరుగు ప్రయాణం అయ్యారు.



గద్దెల ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

స్థానికుల సందడి..

తిరుగువారం పండుగ కావడంతో తల్లులను దర్శించుకునేందుకు మేడారం పరిసర గ్రామాల ప్రజలు వేల సంఖ్యలో తరలివచ్చారు. మేడారం, రెడ్డిగూడెం, కన్నెపల్లి, ఊరట్టం, కాల్వపల్లి, నార్లాపూర్, వెంగళాపూర్, బయ్యక్కపేట, పడిగాపూర్, ఎల్బాక, తాడ్వాయి, తదతర గ్రామాల్లోని ప్రజలు జాతర సమయంలో వ్యాపారాల నిమిత్తం, జాతర రద్దీని తట్టుకోలేక దర్శనానికి రాలేకపోయారు. తిరుగువారం పండుగ సందర్భంగా గ్రామాల్లోని ఆడపడుచులు ఇళ్లు అలికి ముగ్గులతో అలంకరించుకొని



యాటపోతుతో మొక్కుతున్న భక్తులు

కుటుంబ సమేతంగా మేడారానికి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తిరుగువారం పండుగతో గ్రామాల్లో కూడా పండుగ వాతావరణం కనిపించింది.

ప్రశాంతంగా దర్శించుకున్నాం..



సమ్మక్క–సారలమ్మలను ప్రశాంతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నాం. జాతర సమయంలో భక్తుల తాకిడి దృష్ట్యా రాలేకపోయాం. తిరుగువారం పండుగ రోజు తల్లులను దర్శించుకుంటే శుభం కలుగుతుందని విశ్వాసం. ఉదయాన్నే ఇళ్లు, వాకిలి శుద్ధీ చేసుకొని ఇంటి వద్ద పూజలు చేసి తల్లుల దర్శనానికి వచ్చాం.

– కల్యాణి, తాడ్వాయి

ఉద్యోగం రావాలని కోరుకున్నా..



కుటుంబ సమేతంగా సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్నాం. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్నా. మళ్లీ జాతర వరకు ప్రభుత్వ ఉద్యోగం రావాలని తల్లులను కోరుకున్నా. తిరుగువారం పండుగ రోజు అమ్మవార్లను దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించింది.

– గౌని కీర్తన, యువతి

తల్లుల సేవలో రమేష్



సమ్మక్క గద్దె వద్ద మంత్రి సీతక్కతో రమేష్

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో సిద్దబోయిన రమేష్ తల్లుల సేవలకు నిమగ్నమైయ్యారు. జాతరకు రెండు నెలల ముందు నుంచి ప్రోటోకాల్ ప్రకారం అమ్మవార్ల దర్శనానికి వచ్చే కింద స్థాయి ప్రజాప్రతినిధుల నుంచి ఎమ్మెల్యే, మంత్రులను, ఉన్నతాధికారులను గద్దెల వద్దకు తీసుకెళ్లి దర్శనాలు చేయించారు. జాతర సమయంలో నాలుగు రోజులు కూడా వందలాదిగా వచ్చిన వీఐపీలకు దగ్గరుండి దర్శనాలు చేయించి, అమ్మవార్ల ప్రసాదం అందించారు. గద్దెల వద్ద భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్న సమయంలో కూడా ఏ మాత్రం అలసటకు గురికాకుండా ఓపిక, సహనంతో వీవీఐపీలు, వీఐపీలకు అమ్మవార్ల దర్శనాలు చేయించడంలో కీలక పాత్ర పోషించాడు. రమేష్ సేవలను పలువురు వీఐపీలు, మంత్రులు అభినందించారు. అందరికీ దగ్గరుండి దర్శనాలు చేయించడం అమ్మవార్లకు చేసిన సేవగా భావిస్తానని రమేష్ తెలిపారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సలీం

ఏటూరునాగారం: ఏటూరునాగారం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సలీమ్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఖాజామొహినొద్దీన్ భూపాలపల్లికి బదిలీ కాగా కన్నాయిగూడెంలో పనిచేస్తున్న సలీమ్‌ను ఏటూరునాగారం ఇన్‌చార్జ్‌గా బాధ్యతలను అప్పగించారు.

గ్రామ పంచాయతీ రోడ్డు కబ్జా!



అక్రమంగా ఉన్న షెడ్డును తొలగిస్తున్న సిబ్బంది



సిబ్బందిని బెదిరిస్తున్న వావిలాల స్వామి

- అక్రమంగా ఇంటి నిర్మాణం
- అడ్డుకున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 12 వార్డులోని గ్రామ పంచాయతీ రోడ్డును గ్రామానికి చెందిన వావిలాల స్వామి కబ్జా చేసి అక్రమంగా షెడ్డును నిర్మించగా బుధవారం గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ రవీందర్, వెంకన్న, సిబ్బంది వెళ్లి దానికి తొలగించారు. అమ్మ ఆస్పత్రి ఎదురుగా మేయిన్ రోడ్డుకు వల్స శ్రీను, పింగిలి లక్ష్మి ఇంటి మధ్యలో ఉన్న 20 ఫీట్ల రోడ్డు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగపడే పంచాయతీ రోడ్డును కబ్జా చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రజలకు రవాణా, వాహనాలు నడిచేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆ రోడ్డు నిర్మాణం కోసం చదును చేయగా స్వామి రాత్రికి రాత్రే రేకులను వేసి కబ్జా చేసే ప్రయత్నం చేశారు. కాగా, అక్రమంగా వేసిన షెడ్డు రేకులను తొలగించిన రవీందర్, వెంకన్నపై స్వామి ఎస్సీ, ఎస్టీ కేసు పెడుతానని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది. రెవెన్యూ అధికారులు వచ్చి చూడాల్సి ఉందని, మీరు ఇక్కడికి రావడానికి ఎవరు అని అనడంతో చేసేది ఏమిలేక గ్రామ పంచాయతీ అధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని తహసీల్దార్ సలీం, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్‌కు వావిలాల స్వామిపై ఫిర్యాదు చేస్తూ దరఖాస్తు అందజేశారు. గ్రామ అవసరాల కోసం ఉపయోగించే రో డ్డును ఎవరు కబ్జా చేసిన చర్యలు తీసుకోవాలని గ్రా మం లోని ప్రజలు అధికారులను డిమాండ్ చేశారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓ వెంటనే స్పందించి కబ్జా అయిన రోడ్డును గ్రామ పంచాయతీకి అప్పగించి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై జీపీ సిబ్బంది రవీందర్ మాట్లాడుతూ.. కబ్జా చేసినట్లు తమకు సమాచా రం అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాలకు అక్క డి వెళ్లి రేకులను తొలగించగా తమపై బె దిరింపులకు రావడంతో రేకులు అక్కడే వదిలేసి వచ్చామని, అతడిపై అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే స్వామి మాట్లాడుతూ.. రోడ్డుకు అవసరం ఉంటే మళ్లీ ఇస్తామని, కొబ్బరికాయాలు, పుచ్చకాయలు అమ్మడానికి వేస్తున్నట్లు తెలిపాడు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన బాలికల కళాశాలలో బుధవారం ఇంటర్ ప్రథమ వార్షిక పరీక్షలు ప్రారంభమైయ్యాయి. రెండు కళాశాలలోని రెండు పరీక్ష కేంద్రాలలో 520 మంది విద్యార్థులకు 478 మంది హాజరైనట్ల పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పవన్ రాజ్, డిపార్ట్‌మెంట్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు బందోబస్తు, వైద్య సిబ్బంది పరీక్ష కేంద్రం వద్ద విధులు నిర్వర్తించారు. పరీక్ష కేంద్రం వైపు ఎవరు రాకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. అయితే కొంత మంది విద్యార్థులు గిరిజన బాలికల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాస్‌కాపియింగ్‌కు పాల్పడే యత్నం చేయడంతో పోలీసులు దానిని నివారించి విద్యార్థులకు బయటకు పంపకుండా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా క్రాస్‌రోడ్డులోని పలువురు జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు మైక్రో జిరాక్స్‌లు తీసి నేరుగా కళాశాలలకు అందిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



ఏటూరునాగారం: పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

మంగపేట: మండల కేంద్రంలోని ఎక్కటి సరోజినీ శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మొదటి రోజు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు క ళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. ఇంటర్ ప్రథ మ సంవత్సరం 114 మంది విద్యార్థుకు 108 మంది హాజరయ్యారన్నారు. మాస్ కాపీయింగ్‌కు పల్పడకుండా కాలేజీ అధ్యాపకులు విద్యార్థులను క్షణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాల్‌లోకి అనుమతించారు.



ఏటూరునాగారం: ప్రభుత్వ కళాశాల వద్ద పోలీసు బందోబస్తు

వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 74 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. జెనరల్ పరీక్షల్లో 93 మందికి గాను 89 మంది హాజరు కాగా గైర్హాజర్ అయ్యారు. ఒకేషనల్ కోర్స్‌లో 102 మందికి గాను 70 మంది విద్యార్థులు గైర్హాజర్ కాగా 32 మంది విద్యార్థులు పరీక్షలను రాశారు. కళాశాల చరిత్రలో ఈ స్థాయిలో విద్యార్థులు పరీక్షలకు గైర్హాజర్ కావడం తొలిసారి.



మంగపేట: రూం నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



మంగపేట: తనిఖీ చేస్తున్న అధ్యాపకులు



వాజేడులో..

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



గోవిందరావుపేట: ఎగ్జిబిట్స్‌ని చూస్తున్న జిల్లా సైన్స్ అధికారి జయదేవ్



ములుగు: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మల్లేశం



ములుగు రూరల్: బరిగలానిపల్లిలో..



వెంకటాపురం(కె)లో..

ములుగు: విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పుల మల్లేశం అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా భౌతికశాస్త్ర ఆధ్యాపకురాలు రజినీలత అధ్యక్షతన కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రిన్సిపల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు శాస్త్ర విజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సమావేశంలో వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సమ్మయ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రమేష్ చంద్రశ్రీకాంత్, అకాడమిక్ కో ఆర్డినేటర్ వెంకన్న, రసాయనశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ విజిత, జంతుశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ అనిల్, గణితశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ శంకర్, డాక్టర్ యుగేందర్, డాక్టర్ మహేందర్, డాక్టర్ ఉమాదేవి, నాగమణి, ఉదయశ్రీ, తేజోలత, శ్రీనివాస్, మైలానా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని పస్రా పాఠశాలలో ప్రాధానోపాధ్యాయుడు వన్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, ఏఎంఓ బద్దం సుదర్శన్, సెక్టోరియల్ అధికారి ఆశ్రమం రాజు హాజరైయ్యారు. పాఠశాల విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన 150 ఎగ్జిబిట్స్‌ను తయారు చేశారు. ఎగ్జిబిట్స్‌ను చూసి విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయులను వచ్చిన అధికారులు అభినందించారు.

ములుగు రూరల్: మండలంలోని బరిగలానిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి పోషన్న సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీవీ రామన్‌కునోబెల్ బహుమతి సాధించిన రోజును సైన్స్ దినోత్సవంగా నిర్వహించుకుంటామని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు సైన్స్ డే సందర్భంగా ప్రాజెక్టు పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. ఉపాధ్యాయుడు రాజు, అంగన్‌వాడీ టీచర్ ప్రమీల పాల్గొన్నారు.

జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ డే

మండలంలోని అబ్బాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో జన్య ఫౌండేషన్ వారి సహకారంతో సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమాన్ సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందాల రామయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు రామన్, అబ్దుల్ కలాం భారతీయ శాస్త్ర వేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. చిత్ర లేఖనం, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రభావతీ, సురేందర్, పాపిరెడ్డి, శ్రీదరాచారి, శ్రీదేవి, జ్యోతి పాల్గొన్నారు.



ఏటూరునాగారం: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని ఇందిరానగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జన్య ఫౌండేషన్ అధ్వర్యంలో మెడల్స్ అందజేశారు. ఎంఈఓ సాంబయ్య, పాఠశాల హెచ్ఎం రేగ కేశవరావు, ఉపాధ్యాయులు బాబురావు, పాపారావు, చంద్రారెడ్డి, స్వామి, రవీందర్, రజిత, రేణుక పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చిన్న మాట్లాడుతూ.. భారతీయ శాస్త్రజ్ఞుడు సీవీ రామన్ భారత్ గడ్డపైనే చదువుకొని తల మాణికమైన పరిశోధనలు జరిపి సైన్సులో దేశ శక్తిసామార్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పిన మేధావి అని అన్నారు. భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధన ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో నిక్షిప్తం చేసిన వ్యక్తుల్లో సివి రామన్ అగ్రగనుడని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవీందర్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉమారాణి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ స్వామి, రమేష్, రేణుక ఫాతిమా, వెంకటయ్య, జ్యోతిల పాల్గొన్నారు.



ఎస్ఎస్ తాడ్వాయి: హెచ్ఎంకు జ్ఞాపిక అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఘనంగా సైన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాఠశాల హెచ్ఎం జీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ.. సైన్స్ పిత మహుడు సీవీ రామన్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సైన్స్ డే సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుజాత, నర్సింహారావు, సంతోష్ కుమార్, శ్రీరామ్మూర్తి, కల్పన, గంగా, విజయ తదితరులు ఉన్నారు.

రైతులకు యూరియా కొరత

గోవిందరావుపేట: ప్రభుత్వం యూరియా సరైన సమయానికి సరఫరా చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు లక్నవరం ఆయకట్టు, మోటార్ల, బోర్ల కింద యాసంగి పంట పండిస్తున్నారు. ఇప్పటికే రెండోవ సారి యూరియా వేసి మూడో వంతుకు కూడా యూరియా వేయాలి. కానీ మేడారం జాతర ఎఫెక్ట్ వల్ల యూరియా ఆలస్యం అయింది. దీంతో మండలానికి 40 టన్నుల యూరియా రావడంతో వచ్చిన లారీ లోడు దిగుమతి కాకముందే ఒక్కసారిగా మండలంలోని చుట్టు పక్కల గ్రామాల రైతులు ట్రాక్టర్లు, బండ్లు, ఆటోలు తీసుకోని మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘం వద్దకు ఉదయం నుండి బారుదీరారు. అందరికి అందక నిరాశతో చాలా మంది రైతులు వెనుదిరిగారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి సరిపడ యూరియాను త్వరితగతిన సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



లారీ నుంచి ట్రాక్టర్లలో వెసుకుంటున్న రైతులు

గుమ్మడిదొడ్డిలో వైద్యశిబిరం

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామ పంచాయతీలో జ్వరాలు, నొప్పులు వస్తున్న కారణంగా వాజేడు వైద్యాధికారి మహేందర్ ఆధ్వర్యంలో రెండవ రోజు వైద్య శిబిరం ఏర్పాటు చేయించి రోగులను పరీక్షించినట్లు పేర్కొన్నారు. జ్వరాలతో ఉన్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తల్లడి పుష్పలత, కోటిరెడ్డి, వైద్య సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది